క్లుప్తంగా

నేటి నుంచి రుగ్వేద ఘన పారాయణం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రినగర్‌లోని శారదాలక్ష్మీనర్సింహాస్వామి దేవాలయంలో ఈ నెల 25 నుంచి జనవరి 3వ తేదీ వరకు రుగ్వేద సంపూర్ణ కంఠస్త ఘన పారాయణం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. అదేవిధంగా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బ్రహ్మశ్రీ చింతలపల్లి ఉమాశంకర ఘనపాఠి, పాఠకుడు ఆదిత్య జోషిల పర్యవేక్షణలో పారాయణం ఉంటుందని పేర్కొన్నారు.

అయ్యప్ప ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం


హోమం నిర్వహిస్తున్న స్వాములు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని బాల మణికంఠ అయ్యప్ప దేవస్థాన ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు గణపతి హోమం, కలశ పూజ, ధ్వజారోహణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త మద్ది జగదీశ్వర్‌రెడ్డి గురుస్వామి పర్యవేక్షణలో మూడురోజుల పాటు ఈ ఉత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. గురువారం నిర్వహించనున్న మహా పడిపూజ కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

స్వయం ఉపాధితోనే ఆర్థికాభివృద్ధి

మేయర్ చిగురింత పారిజాత


మహిళలకు సర్టిఫికెట్లు అందచేస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: మహిళల స్వయం ఉపాధితోనే ఆయా కుటుంబంలో ఆర్థిక ఎదుగుదల ఉంటుందని మేయర్ పారిజాత అన్నారు. కార్పొరేషన్‌లోని ప్రజాభవన్‌లో జిల్లా జనశిక్షణ అభియాన్ ఆధ్వర్యంలో మహిళలకు బ్యూటీషియన్, కుట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళవారం ఆమె సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళలు స్వయం ఉపాధితో ఎదిగినప్పుడే కుంటుబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, నిమ్మల సునిత, సుదర్శన్ రెడ్డి, రాళ్లగూడం శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, జనశిక్షణ అభియాన్ డైరెక్టర్ రామ్మోహన్, సభ్యురాలు విజయలక్ష్మి, పద్మావతి, మహిళలు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు


భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు కొంగు బంగారంలా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

హయత్‌నగర్: డా.బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్ షాను కేంద్ర కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కృష్ణయ్య డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం హయత్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రపంచ మేధావి అంబేద్కర్‌పై ఇష్టానుసారంగా మాట్లాడిన అమిత్‌షా దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీశారని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, మహేందర్, జానమ్మ, పృథ్వీరాజ్, శ్యాంసుందర్‌రెడ్డి, నరసింహ్మారావు, వెంకటేష్, పెంటయ్య పాల్గొన్నారు.

ముహూర్తం కుదిరేనా!

పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోని సబ్ స్టేషన్

- పిచ్చి మొక్కలు, పొదలతో నిండిన ఆవరణ
- వినియోగదారులు, రైతులకు అందని నాణ్యమైన విద్యుత్
- అధికారులు స్పందించాలని అభ్యర్థన


కొత్తగూడలో పిచ్చిమొక్కలతో నిండిన విద్యుత్ సబ్‌స్టేషన్

కందుకూరు: వినియోగదారులు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలనే లక్ష్యంతో చేపట్టిన సబ్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయినా.. ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో ఈ ప్రాంతం పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. అయినా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదీ కందుకూరు మండలం కొత్తగూడ గ్రామ పరిధిలో నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ దుస్థితి.

ఐదెకరాల్లో..

2013 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఇటు వ్యవసాయంతో పాటు అటు కంపెనీల అవసరాలు తీర్చేందుకు కందుకూరు రెవెన్యూ సర్వే నంబర్ 551లో కొత్తగూడ గ్రామానికి ఆనుకుని ఉన్న ఐదెకరాల సర్కారు భూమిలో 132/33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదించింది. ఆ తర్వాత 2019లో ట్రాన్స్‌కోకు భూమిని అప్పగించడంతో సుమారు రూ.25 కోట్ల నిధులతో పనులకు శంకుస్థాపన చేశారు. భవనంతో పాటు సబ్ స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేసి దాదాపు రెండేళ్లు దాటింది. కానీ ఇంతవరకూ ఇక్కడి నుంచి కరెంటు సరఫరా చేసింది లేదు. కొత్తగా నిర్మించిన సబ్ స్టేషన్ గేటుకు తాళాలు వేసి వదిలేయడంతో ఆవరణ పూర్తిగా పిచ్చి మొక్కలు, పొదలతో అధ్వానంగా, అపరిశుభ్రంగా మారింది. ఎంతో ఖరీదైన భూమిలో సబ్ స్టేషన్ నిర్మించి ఇలా నిరుపయోగంగా వదిలేయడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా సబ్ స్టేషన్‌ను ప్రారంభించాలని కోరుతున్నారు. తక్షణమే ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

వినియోగంలోకి తేవాలి

సబ్ స్టేషన్ నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకూ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ఆ ప్రాంతమంతా పాడుబడ్డట్లు కనిపిస్తోంది. ప్రజల విద్యుత్ అవసరాలు తీర్చేలా సబ్ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.

– సాధ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్, కొత్తగూడ



మార్చి లేదా మేలో ప్రారంభిస్తాం

శ్రీనగర్ ప్రాంతంలోని అటవీ భూముల నుంచి ఇక్కడికి విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలి. ఇందుకు సంబంధించిన అనుమతులు రావడంలో ఆలస్యం జరిగింది. సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి. వచ్చే ఏడాది మార్చి లేదా మే నెల వరకు ప్రారంభించేలా చూస్తున్నాం.

– వెంకటేశ్, ట్రాన్స్‌కో ఏడీఈ


సీతారామ్ ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా పాలన

సీపీఎం సెక్రటేరియట్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, జగదీశ్

కందుకూరు: దేశంలో కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా బీజేపీ పాలన చేస్తుందని సీపీఎం సెక్రటేరియట్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, జగదీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. కందుకూరులో మంగళవారం సీపీఎం మండల 7వ మహాసభలను కామ్రేడ్ కొమ్మగళ్ల భిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేద, బడుగు బలహీన వర్గాలను విస్మరిస్తూ, పెట్టుబడిదారుల కొమ్ముకాస్తు ప్రధానీ నరేంద్రమోడీ పాలన సాగిస్తున్నారన్నారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడే వారిని సీబీఐ, ఈడీల పేరుతో వేధిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీలు ఊసేలేకుండా పోయిందన్నారు. ముందుగా నిర్వహించిన సభలో సీతారామ్ ఏచూరికి నివాళులర్పించారు.

మండల నూతన కార్యదర్శిగా బాల్‌రాజ్...

మహాసభల్లో సీపీఎం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా బుట్టిబాల్‌రాజ్‌ను, సభ్యులుగా రావిచెట్టు చందు, అంకగళ్ల కుమార్, బుడ్డీరపు శ్రీనివాస్, నోముల నరసింహా, కె.కృష్ణ, నరసింహా, శ్రీశైలంలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి బాల్‌రాజ్ మాట్లాడారు. పార్టీ బలోపేతం కోసం కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు డి.రాంచందర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్



వనస్థలిపురం: యువ జూనియర్ కళాశాలలు వనస్థలిపురం, దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచిల విద్యార్థులకు స్పోర్ట్స్ మీట్ సందర్భంగా సోమ, మంగళవారాల్లో సరూర్‌నగర్ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అంబర్‌పేట మండల ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. చదువుతోపాటు క్రీడలు అవసరమన్నారు. కళాశాల డైరెక్టర్ నందికంటి భాస్కర్ మాట్లాడుతూ.. పరీక్షల కు ముందు క్రీడలు మనో వికాసాన్ని కలిగిస్తాయన్నారు.


ర్యాలీ ప్రారంభిస్తున్న ఇబ్రాం శేఖర్

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట్: పేదలు, బడుగు బలహీన వర్గాలకు ఎప్పుడు బాబాసాహెబ్ అంబేద్కర్ భగవానుడేనని బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ అన్నారు. మంగళవారం బహుజన సమాజ్ పార్టీ అధినేత్రి బెహెన్జి మాయావతి ఆదేశాను సారం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. బడంగ్‌పేటలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు భారీఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాతను పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి అమిత్‌షా అవమానించడం క్షమించరాని నేరమన్నారు. భారత రాజ్యాంగంలో ప్రసాదించిన హక్కులతోనే పార్లమెంట్‌లో అడుగుపెట్టిన సంగతి మరచిపోయాడా అని నిలదీశారు. దేశంలోని అందరూ బాబా సాహెబ్‌కు రుణపడి ఉండాలన్నారు. అంబేద్కర్‌ను అవమానించడంతో దేశ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని అందుకుగాను బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాల వేసి దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని శేఖర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండెల ధర్మేందర్, రాష్ట్ర కార్యదర్శి గ్యార జగన్, జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పల్లాటి రాములు, అసెంబ్లీ అధ్యక్షుడు బహుగుణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పేదొకటి చేసేదిమరొకటి
- అతిపెద్ద సర్కిల్‌గా గాంధీనగర్


కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌ను అధికారులతో కలిసి సందర్శించారు. 28, 29 డివిజన్ల మధ్య ఉన్న గాంధీనగర్‌ను ఆమె పరిశీలించారు. కమిషనర్ సరస్వతి, ఇంజనీరింగ్ అధికారులతో, కార్పొరేటర్లతో చర్చించి, త్వరలో ప్లాన్ రెడీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి పేరిటా గ్రామాలు, మున్సిపాలిటీలను అభివృద్ధి చేసిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒకటి చెప్పి, మరొకటి చేస్తుందని విమర్శించారు. నేడు సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. గతేడాది నుంచి చూస్తున్నాం. ఏ మున్సిపాలిటీకైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుంచి ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదన్నారు. ఇటీవల శ్రీధర్ బాబు వేయించిన రోడ్డు గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో శివారు మున్సిపాలిటీలకు రూ.1450కోట్లు మంజూరైనవే తప్పా, కొత్తగా ఎలాంటి నిధులు కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులకు టెంకాయలు కొడుతున్నారే కానీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. ప్రజల అవసరాల కోసం అన్ని ఒకే చోట్ల దొరికేలా బడంగ్‌పేటలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు మొదలుపెట్టామని మధ్యలోనే నిలిపేసిన పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని రేవంత్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో నాడు రోడ్ల వెడల్పుకు హెచ్ఎండీఏ నిధులు మంజూరు చేయించామన్నారు. బీఆర్‌ఎస్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని ఈ పనులను కావాలనే ఆపేస్తున్నారన్నారు. మెయిన్‌రోడ్ల వెడల్పులో భాగంగా మిగిలిపోయిన స్తంభాలను తొలగించాలని బడంగ్‌పేట కార్పొరేషన్ అధికారులను ఏడాదిగా రిక్వెస్ట్ చేస్తున్నా, పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. గాంధీనగర్ సర్కిల్, నాదర్‌గుల్ సర్కిళ్లను పెద్దవి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. దావుత్‌ఖాన్‌గూడకు 50 పడకల ఆసుపత్రి మంజూరైందని, దీని కోసం ఎకరా స్థలం కూడా కేటాయించామని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం పట్టించుకొని ఆస్పత్రి పనులు పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జనాభా ప్రాతిపదికన బడంగ్‌పేటలో కొత్త పోలీస్‌స్టేషన్ ఏర్పాటును ఆహ్వానిస్తున్నామన్నారు.

క్రిస్మస్‌కు చర్చిలు ముస్తాబు


మహేశ్వరం: మండల కేంద్రంలో వేడుకలకు సిద్ధంగా ఎంబీ చర్చి


మీర్‌పేట: మిథులానగర్‌లో విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న హోలీ కింగ్స్ చర్చి

మహేశ్వరం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. మంగళవారం మండల పరిధిలోని దుబ్బచర్ల గ్రామ పంచాయతీ లిల్లీపూర్‌లో సెయింట్ థామస్ చర్చి, కేకే బస్తీలో ఉన్న మరియామాత చర్చి, మహేశ్వరం మండల కేంద్రంలో ఉన్న ఎంబీ చర్చీ, దుబ్బచర్ల, చిన్న తూప్ర గ్రామాల్లో ఉన్న చర్చీలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలు, రంగులు, డెకరేషన్స్, స్టార్స్, క్రిస్మస్ ట్రీస్, రంగు రంగుల బొమ్మలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. లీల్లీపూర్ చర్చిలో క్రైస్తవులు యేసు ప్రభువు జన్మదినం సందర్భంగా రాత్రి కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. చర్చిలో క్రీస్తు బోధనలు వినిపించి, నాటికలు వేశారు. చర్చీల్లో క్రిస్మస్ ట్రీస్, స్టార్స్,యేసు క్రీస్తు జన్మస్థలం పశుపాకలను విద్యుత్ దీపాలతో సర్వంగ సుందరంగా తీర్చిదిద్దారు. చర్చిలో పిల్లలు సందడి చేశారు. కార్యక్రమంలో లిల్లీపూర్ సెయింట్ థామస్ చర్చి ఫాదర్ డానియేల్, మహేశ్వరం ఎంబీ చర్చి పాస్టర్ సురేశ్‌కుమార్, మాజీ సర్పంచ్ స్లీవారెడ్డి, కల్వకోల్ మాజీ సర్పంచ్ థామస్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దేవేందర్ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ కేంద్రంలోని లార్డ్స్ స్కూల్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు జనన విధానాన్ని నిర్వాహకులు విద్యార్థులకు తెలియజేశారు. ఒకరికొకరూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీలత, డీన్ సతీశ్, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్‌రెడ్డి, రామిడి సంతోష్, ఇన్‌చార్జి రేఖాసాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది

విలువలతో కూడిన విద్యా బోధన ముఖ్యం

దిల్‌సుఖ్‌నగర్: విలువలతో కూడిన విద్యా బోధన ఎంతో ముఖ్యమని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కొత్తపేటలో నిర్వహించిన ఆర్‌కేపురం భాష్యం పాఠశాల 14వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి యువత, విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఐప్యాడ్, కంప్యూటర్ లాంటి వాటికి వీలైనంత వరకు దూరంగా ఉండాలన్నారు. భాష్యం సీఈవో చైతన్య మాట్లాడుతూ.. తమ పాఠశాలలో విద్యా విధానం విద్యార్థుల సర్వముఖాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పారావు, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ అనుపమ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సందీప్ శాండిల్య

హయత్‌నగర్: మత్తు పదార్థాలు వాడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని యాంటీ నార్కొటిక్ డైరెక్టర్ సందీప్ శాండిల్య అన్నారు. హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ పాఠశాలలో మంగళవారం నార్కోటిక్ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడకాన్ని ఉక్కుపాదంతో అణిచి వేసి డ్రగ్స్ వాడకం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. నూతన సంవత్సర వేడుకలను నిర్వహించే హోటళ్లు, రిసార్ట్స్, పబ్‌లపై నిఘా పెంచుతున్నామన్నారు. ఉపాధ్యాయులు విద్యా ర్థుల ప్రవర్తనను గమనించి వారికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు.

డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్


వినతిపత్రం అందజేస్తున్న సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణగౌడ్, డీలర్లు

మహేశ్వరం: రేషన్ డీలర్ల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం నాయకులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను విస్మరించి అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రతీ రేషన్ డీలర్‌కు గౌరవ వేతనం రూ.10 వేలు, క్వింటాల్‌కు రూ.300 కమీషన్ ఇస్తామని హామీ ఇచ్చామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రేషన్ డీలర్ల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. డీలర్ల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులిమామిడి లక్ష్మీనారాయణగౌడ్, పలు జిల్లాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు, డీలర్లు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన


ముగ్గులు వేసి నిరసన

ఇబ్రహీంపట్నం రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట మంగళవారం వినూత్న నిరసన ప్రదర్శించారు. సీఎం సారు స్పందించాలంటూ కలెక్టరేట్ రోడ్డుపై టీకప్పులు వేసి వేడుకున్నారు. బుర్రకథలు, కోలాటాలు, బతుకమ్మ పాటలతో నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అజీజ్, ప్రధాన కార్యదర్శి సంపత్, జిల్లా నాయకులు సాయికుమార్, మహిళా నాయకురాలు శ్రీలత, పద్మ, భార్గవి, సుజాత, ఆల్‌వింగ్స్ సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట బుర్రకథలు చెబుతున్న సమగ్ర ఉద్యోగులు